ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి


తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :232 సోమవారం జూన్ 15 2026, పేజీలు - 4 వేల : 2/- | epaper.manaprajaprathinidhi.com | PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# ప్రజా ప్రతినిధుల అండ దండలు సామాన్యులకు న్యాయం ఎక్కడ

# ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో




- సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాల అడ్డా '?
- అధికారులడాక్యుమెంట్ రైటర్ల అక్రమ దందా బహిర్గతం ?
- సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అవినీతికి కేంద్రమా ?

## ▶సామాన్య ప్రజలపై దోపిడీ ఆరోపణలు




హుజూర్ నగర్ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిబంధనలను పక్కన పెట్టి, భారీ మొత్తాల్లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు!నేరుగా వెళ్తే సేవలు నిలిపివేత? మధ్యవర్తులతో మార్గం సులభం..కార్యాలయానికి నేరుగా వెళ్లిన వారికి పనులు జరగడం లేదని వినిపిస్తున్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తప్పనిసరిగా ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వెళ్లాల్సిందేనన్న పరిస్థితి నెలకొన్నట్లు బాధితులు చెబుతున్నారు.ఇది ప్రభుత్వ కార్యాలయమా? లేక మధ్యవర్తుల ఆధీనంలో నడిచే ప్రైవేట్ వ్యవస్థనా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు!

(తెలంగాణస్టేట్‌బ్యూరో ప్రత్యేక కథనం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం): మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగాఆస్తి విలువల ఆధారంగా దంధారిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆస్తి విలువల ఆధారంగా భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపణలు. కొద్దిమంది డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయం పై పూర్తిగా ఆధిపత్యం చెలాయిస్తూ, అధికారులతో సన్నిహితంగా వ్యవహరిస్తూ వ్యవస్థను నియంత్రిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.? రోజువారి వసూళ్ల దందా..సాయంత్రం కాగానే లెక్కలు.?ప్రతి డాక్యుమెంట్‌ను గమనించి, ఏ రైటర్ ద్వారా వచ్చిందో నమోదు చేసి, 'ఫీజు టు ఫీజు' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. సాయంత్రం సమయంలో ప్రత్యేకంగా వసూళ్ల లెక్కలు వేసి, రైటర్ల నుంచి డబ్బులు సేకరిస్తున్నారని బాధితులు అంటున్నారు. ఇది ఓ పద్ధతిగా కొనసాగుతోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి!ప్రజా ప్రతినిధుల అండ దండలు సామాన్యులకు న్యాయం ఎక్కడ సార్ ?కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలు పెంచుకుని, అధికారులపై ప్రభావం చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ, న్యాయం కోసం తలుపులు తడుతున్నా ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## ▶అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?




ఇన్ని ఆరోపణలు వెలుగులోకి వస్తున్నప్పటికీ, ఉన్నతాధికారుల స్పందన లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇది పర్యవేక్షణ లోపమా? లేక వ్యవస్థాగత వైఫల్యమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వం తక్షణమే స్పందించి, పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇంత వ్యవహారం జరుగుతున్న జిల్లాలో జాడ లేని విజిలెన్స్ మరియు అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని హుజూర్ నగర్ ప్రజలు కోరుతున్నారు వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో

ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి


తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :232 సోమవారం జూన్ 15 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# రామమందిర విరాళాల వివాదం



❍ఆరోపణలతో రాజకీయ దుమారం
❍దర్యాప్తుపై పెరుగుతున్న ఒత్తిడి
❍సిట్ ఏర్పాటు చేసిన యూపీ

అయోధ్య, జూన్ 14 (మనప్రజాప్రతినిధి): అయోధ్యలోని రామ మందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల వినియోగంపై వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. విరాళాల నిర్వహణలో పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపిస్తుండగా, ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా కూడా వేడెక్కుతోంది. ఆలయ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ట్రస్టు నుంచి వచ్చిన వివరణ అనేక వర్గాలను సంతృప్తిపరచలేకపోవడంతో వివాదం మరింత ముదురుతోంది. ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ జరపాలనే డిమాండ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ వివాదానికి సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ చేసిన ఆరోపణలే ప్రధాన కారణంగా మారాయి. సామాజిక మాధ్యమ వేదికలో ఆయన చేసిన వ్యాఖ్యల అనంతరం ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆరోపణలు

2

## వర్షాకాలంపై సీఎం హెచ్చరిక





◆ అలసత్వంపై కఠిన చర్యలు
◆అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
◆ ప్రజలకు ఇబ్బందులు కలుగొద్దు
◆ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు





●ఖైరతాబాద్‌లో కార్యకర్తల సభ
●రేవంత్‌పై తీవ్ర ఆరోపణలు
●హామీల అమలుపై ప్రశ్నలు

2

## అంబర్‌పేట్ అభివృద్ధే లక్ష్యం



❑కార్యకర్తలకు కిషన్ పిలుపు
❑బీజేపీ బలోపేతంపై దృష్టి
❑కేంద్ర నిధులతో అభివృద్ధి



2

## ఓటరు జాబితాపై దృష్టి



◆బీఎల్ఏలతో ఉప ముఖ్యమంత్రి సమావేశం
◆ప్రజాస్వామ్యానికి ఓటే బలం
◆సవరణ ప్రక్రియపై సూచనలు

మంచిర్యాల, జూన్ 14 (మన ప్రజాప్రతినిధి): మంచి ర్యాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటరు నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని స్పష్టం చేశారు. దేశ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యానికి ఓటు హక్కే ప్రధాన సాధనమని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించడం అందరి బాధ్యత అని వివరించారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం వల్ల ఎవరూ తమ రాజ్యాంగబద్ధ హక్కును కోల్పోకూడదని అన్నారు. బూత్ స్థాయి ప్రతినిధులు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండటం వల్ల వారికి మరింత బాధ్యత ఉంటుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, కాలనీలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించాలని సూచించారు. కొత్తగా అర్హత సాధించిన యువతను గుర్తించి వారి పేర్లను నమోదు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి వివరాలను కూడా సక్రమంగా నమోదు చేయాలని చెప్పారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. అందువల్ల ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి అధికారులతో సమన్వయం



2

## గోదావరి జలాలపై ఏపీ హక్కు



■బనకచర్లకు ఇంజనీర్ల మద్దతు
■కరవు ప్రాంతాలకు జీవనాడి
■ముఖ్యమంత్రికి కీలక లేఖ

2

## మార్గదర్శక్‌కు విశేష స్పందన



❍తొలి విడతకు ధ్రువపత్రాలు
❍రెండో విడతకు శ్రీకారం
❍భద్రతలో ప్రజల భాగస్వామ్యం
❍పోలీసు కమిషనర్, నగర భద్రతా మండలి అధ్యక్షుడు వీ.సీ. సజ్జనార్

2

# రామమందిర విరాళాల వివాదం

మెదటి పేజీ తరువాయి



వెలుగులోకి వచ్చిన తర్వాత శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ స్పందించారు. ట్రస్టు కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు అంతర్గత తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం కూడా అదే ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి అక్రమాలకు సంబంధించిన ఆధారాలు లభించలేదని కూడా స్పష్టం చేశారు. అయితే ట్రస్టు వివరణపై ప్రతిపక్షాలతో పాటు కాషాయ శిబిరంలోని కొందరు నాయకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయోధ్యకు చెందిన దంత వైద్యుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు రజనీష్ సింగ్ ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. విరాళాల సేకరణ నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే వరకు మొత్తం ప్రక్రియపై ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని ఆయన కోరారు. ట్రస్టు మౌనం ప్రజల్లో అనుమానాలను పెంచుతోందని, అందువల్ల నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో ట్రస్టుతో సంబంధం ఉన్న కొందరు మతపెద్దలు కూడా తమ సందేహాలను బహిరంగంగా వ్యక్తం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ వారసుడిగా భావిస్తున్న కమల్ నయన్ దాస్ కూడా విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో విచారణ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యుల తీరుపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో వివాదం కేవలం రాజకీయ పరిమితుల్లోనే కాకుండా ఆలయానికి సంబంధించిన వర్గాల్లోనూ చర్చకు కారణమైంది. ఇదే అంశంపై భారతీయ జనతా పార్టీ సభ్యుడు, అలహాబాద్ ఉన్నత న్యాయస్థాన న్యాయవాది మురళీధర్ సింగ్ కూడా ప్రధానమంత్రికి లేఖ రాశారు. విరాళాల దుర్వినియోగం, అపహరణ ఆరోపణలపై ఉన్నత స్థాయి కేంద్ర సంస్థతో నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని ఆయన కోరారు. అలాగే భారత ప్రధాన లెక్కల పరిశీలన సంస్థ ద్వారా ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యల ద్వారా మాత్రమే ప్రజల్లో నెలకొన్న అనుమానాలు తొలగిపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోపణల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు ఈ బృందం ఏర్పాటైనట్లు అధికారులు వెల్లడించారు. లక్నో విభాగ కమిషనర్ విజయ్ విశ్వాస్ పంత్, పోలీసు ఉన్నతాధికారి కిరణ్ ఎస్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి నీల్ రతన్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం. ఈ దర్యాప్తు ఫలితాలపై ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# వర్షాకాలంపై సీఎం హెచ్చరిక

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూన్ 14 (మన ప్రజాప్రతినిధి): వర్షాకాల సీజన్‌లో అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. వర్షాల కారణంగా తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాకాల సన్నద్ధతపై ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, నీటిపారుదల, పురపాలక, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, వాతావరణ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జూన్ 9న నగరంలో కురిసిన భారీ వర్షాల సమయంలో ఏర్పడిన పరిస్థితులను సమీక్షించిన ముఖ్యమంత్రి, ట్రాఫిక్ సమస్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాతావరణ హెచ్చరికలు ఉన్నప్పటికీ సంబంధిత శాఖలు తగిన స్థాయిలో స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల సమయంలో పురపాలక, పోలీసు శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు శాఖాధిపతిని ఆదేశించారు. వర్షం పడే సమయంలో పురపాలక శాఖ, జలమండలి, ట్రాఫిక్, హైడ్రా, పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైతే తాను కూడా రోడ్లపైకి వచ్చి పరిస్థితిని పరిశీలిస్తానని చెప్పారు. ట్రాఫిక్ సమస్యల విషయంలో ఇకపై ఏమాత్రం రాజీ ఉండదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వర్షాల కారణంగా నగరంలో వాహనాల రాకపోకలు స్తంభిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలు, ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉండే ప్రాంతాలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కూడా ఆదేశించారు. విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయ శాఖల పనితీరుపై కూడా ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా చెట్లు కూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయే పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల చరవాణి విద్యుత్ మార్పిడి కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద ఇంజినీర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా విధులు వదిలి వెళ్లే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, ఎరువుల సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటి కలుషితాన్ని నివారించేందుకు నిరంతర పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులకు ఆదేశించారు. సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్య శాఖ ముందస్తుగా మందులు, వైద్య సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వర్షాకాలంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు

# కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూన్ 14 (మన ప్రజాప్రతినిధి): ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ సాధారణ సభలో పాల్గొన్న పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ పాలనను 'అట్టర్ ఫ్లాప్' సినిమాతో పోల్చిన ఆయన, సగం పాలనా కాలం పూర్తయినా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సొంత పార్టీ నాయకులనే వెన్నుపోటు పొడిచే వ్యక్తిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌పై తప్పుడు కేసులు నమోదు చేయించడం వెనుక రాజకీయ కక్షసాధింపే కారణమని పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న అవినీతి, అక్రమాల గురించి పార్టీ అధిష్ఠానానికి చెప్పినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటానని చెప్పడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ హామీల అమలుపై మాట్లాడిన కేటీఆర్, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఎక్కడ అమలయ్యాయో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు నాలుగు వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీ కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచిపోయి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మహిళలకు సంబంధించిన హామీలపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన హామీ ఏమైందని నిలదీశారు. ఒక్కో మహిళకు ప్రభుత్వం లక్షా ఇరవై ఐదు వేల రూపాయలు బాకీ ఉందని అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులను ఇతర పార్టీల్లో చేర్చుకోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని విమర్శించారు. త్వరలో జరిగే ఉప ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధి, పేదల సంక్షేమంపై కూడా కేటీఆర్ మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం దుర్మార్గమని అన్నారు. కేసీఆర్ పాలనలో పేదలకు ఇంటి పట్టాలు, గృహ సదుపాయాలు కల్పించగా ప్రస్తుతం ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. విద్యుత్, మంచినీటి రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలను గుర్తుచేస్తూ, తిరిగి అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో ప్రతి ఇంటికి రక్షిత తాగునీటిని ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య రంగంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను కేటీఆర్ ప్రస్తావించారు. భారీ ఆసుపత్రులు, బస్తీ దవాఖానాలు, పేదల కోసం ధర్మశాలలు నిర్మించామని గుర్తుచేశారు. ఖైరతాబాద్‌లో రాబోయే రాజకీయ పరిణామాలపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు నమోదు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లోకి వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# అంబర్‌పేట్ అభివృద్ధే లక్ష్యం

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూన్ 14 (మన ప్రజాప్రతినిధి): అంబర్‌పేట్ ప్రజలు ఉమ్మడి రాష్ట్రం నాటి నుంచి భారతీయ జనతా పార్టీకి కొండంత అండగా నిలుస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, క్షేత్రస్థాయి బలోపేతం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. అంబర్‌పేట్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తాను శాసనసభ్యుడిగా పనిచేసిన కాలం నుంచి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించని సందర్భాల్లో కూడా వెనక్కి తగ్గకుండా కేంద్ర నిధులను తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పనిని ముందుకు తీసుకెళ్లామని అన్నారు. అంబర్‌పేట్‌లో ఇప్పటివరకు కేంద్ర నిధులతో దాదాపు వందకు చేరువలో సామాజిక భవనాలు, బస్తీ దవాఖానాలు నిర్మించినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడే విధంగా ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి రాజకీయాలకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అంబర్‌పేట్ వంతెన నిర్మాణాన్ని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు అమలులో ఎన్నో అడ్డంకులు ఎదురైనా ప్రజల కోసం పోరాడి దాన్ని పూర్తి చేయించామని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు అడ్డంకులు సృష్టించినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేయలేకపోయాయని విమర్శించారు. ప్రజల ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ పథకాల ప్రయోజనాలు ప్రతి ఇంటికీ చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి తోడ్పడాలని కోరారు. పార్టీ కార్యకర్తలు ప్రజలకు సేవ చేసే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం ద్వారానే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంబర్‌పేట్ అభివృద్ధితో పాటు తెలంగాణలో భారతీయ జనతా పార్టీ విస్తరణ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ఓటరు జాబితాపై దృష్టి

మెదటి పేజీ తరువాయి

చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా ఉంటే ఎన్నికల ప్రక్రియ అంత పారదర్శకంగా ఉంటుందని వివరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో ఈ ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల సమయంలో ఒక ఓటు కూడా ఫలితాలను ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. అందువల్ల ఓటరు జాబితాలో అర్హుల పేర్లు చేరేలా, అనర్హుల పేర్లు తొలగేలా చర్యలు తీసుకోవాలని బూత్ స్థాయి ప్రతినిధులకు సూచించారు. ప్రజల్లో కూడా ఓటు హక్కుపై అవగాహన పెంచాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న బూత్ స్థాయి ప్రతినిధులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తూ

# మార్గదర్శక్‌కు విశేష స్పందన


తరువాయి భాగం



హైదరాబాద్, జూన్ 14 (మనప్రజాప్రతినిధి): నగర భద్రతలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో హైదరాబాద్ నగర భద్రతా మండలి, హైదరాబాద్ నగర పోలీసు శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'మార్గదర్శక్' కార్యక్రమం విశేష విజయాన్ని సాధించింది. బంజారాహిల్స్‌లోని తెలంగాణ సమగ్ర కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం ప్రాంగణంలో తొలి విడత శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువపత్రాల ప్రదానోత్సవం నిర్వహించడంతో పాటు రెండో విడత కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉన్నతాధికారులు, సామాజిక ప్రముఖులు, శిక్షకులు, పాల్గొన్న స్వచ్ఛంద సేవకులు హాజరయ్యారు. నగరంలో భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలకు తోడ్పడేలా పౌరులను తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. మహిళల భద్రత, అంతర్జాల నేరాలపై అవగాహన, అత్యవసర ప్రతిస్పందన, సామాజిక బాధ్యత వంటి అంశాలపై పాల్గొన్న వారికి ప్రత్యేక శిక్షణ అందించారు. సమాజంలో భద్రతా దూతలుగా వ్యవహరించేలా వారిని సిద్ధం చేశారు. నగర భద్రతలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యానికి ఇది కొత్త దిశను చూపుతోందని అధికారులు పేర్కొన్నారు.మొదటి విడత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎనభై మందికి పైగా పాల్గొన్న వారు నిర్దేశించిన శిక్షణా అంశాలను విజయవంతంగా పూర్తి చేసి 'మార్గదర్శక్' ధ్రువపత్రాలను అందుకున్నారు. శిక్షణ పొందిన ఈ స్వచ్ఛంద సేవకులు తమ తమ ప్రాంతాల్లో భద్రతా అవగాహన కల్పించడంతో పాటు ప్రజలకు అవసరమైన మార్గనిర్దేశం చేయనున్నారు. నగర పోలీసు శాఖ చేపడుతున్న ప్రజా భద్రత కార్యక్రమాలకు వీరు అనుబంధంగా పనిచేయనున్నారు. మొదటి విడత విజయవంతం కావడంతో రెండో విడత కార్యక్రమాన్ని అదే వేదికపై ప్రారంభించారు. రెండో విడతకు ఇప్పటికే రెండు వందల ఎనభై మంది పేర్లు నమోదు చేసుకోవడం విశేషం. ఇది నగర ప్రజల్లో భద్రతా కార్యక్రమాలపై పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమని అధికారులు తెలిపారు. పౌరులు, విద్యాసంస్థలు, నివాస సముదాయాలు ఈ కార్యక్రమానికి విశేష మద్దతు అందిస్తున్నాయని వెల్లడించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్, నగర భద్రతా మండలి అధ్యక్షుడు వీ.సీ. సజ్జనార్ మాట్లాడుతూ ప్రజా భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. 'మార్గదర్శక్' వంటి కార్యక్రమాలు పోలీసులకు ప్రజల మధ్య బలమైన అనుబంధాన్ని ఏర్పరుస్తాయని చెప్పారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌ను మార్గదర్శకుల సలహాదారుగా నియమించే 'పోలీసు మార్గనిర్దేశక కార్యక్రమం'ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. దీనివల్ల శిక్షణ పొందిన స్వచ్ఛంద సేవకులకు నిరంతర సహకారం అందుతుందని తెలిపారు. నగర భద్రతా మండలి ప్రధాన కార్యదర్శి సి. శేఖర్ రెడ్డి మాట్లాడుతూ భద్రత అనేది ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. సరైన అవగాహన, తగిన నైపుణ్యాలు కలిగిన పౌరులు సమాజ భద్రతను మరింత బలోపేతం చేయగలరని చెప్పారు. నగరంలో భద్రత, అప్రమత్తత, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంలో 'మార్గదర్శక్' కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజలు, పోలీసు శాఖ కలిసికట్టుగా పనిచేసినప్పుడే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# గోదావరి జలాలపై ఏపీ హక్కు

తరువాయి భాగం



అమరావతి, జూన్ 14 (మనప్రజాప్రతినిధి): గోదావరి నదిలో సముద్రంలో కలిసిపోతున్న మిగులు వరద జలాలను వినియోగించుకునే పూర్తి హక్కు ఆంధ్రప్రదేశ్‌కే ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ విశ్రాంత ఇంజనీర్ల సంఘం స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన గోదావరిబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు పూర్తిగా సమర్థనీయమైనదని పేర్కొంది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎం. విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. రాష్ట్ర భవిష్యత్తు నీటి అవసరాలు, వ్యవసాయాభివృద్ధి, కరవు నివారణ దృష్ట్యా ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని వారు అభిప్రాయపడ్డారు. తమ లేఖలో గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ 1978లో ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన విశ్రాంత ఇంజనీర్లు, ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన నీటి వాటాలు మినహా మిగిలిన వరద జలాల వినియోగంపై దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని గుర్తు చేశారు. గోదావరిలో ప్రతి సంవత్సరం లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలిసిపోతున్న నేపథ్యంలో ఆ నీటిని ప్రజల అవసరాలకు వినియోగించడం రాష్ట్ర హక్కు మాత్రమే కాకుండా అవసరమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావులేదని స్పష్టం చేశారు.అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం ప్రకారం మిగులు వరద జలాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం గానీ, ఎగువ రాష్ట్రాలు గానీ అభ్యంతరం వ్యక్తం చేసే అధికారం లేదని వారు తేల్చి చెప్పారు. ఇప్పటికే చట్టపరంగా, ట్రిబ్యునల్ తీర్పు పరంగా స్పష్టత ఉన్నందున ఈ ప్రాజెక్టుపై అనవసర వివాదాలు సృష్టించడం సరికాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు అమలును వేగవంతం చేయాలని సూచించారు. గోదావరిబనకచర్ల అనుసంధాన పథకం అమలైతే గోదావరి వరద జలాలను బొల్లపల్లి జలాశయంలో నిల్వ చేసి అవసరమైన ప్రాంతాలకు తరలించే అవకాశం ఉంటుందని సంఘం వివరించింది. ముఖ్యంగా కరవుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాలకు ఇది వరప్రదాయినిగా మారుతుందని పేర్కొంది. సాగునీటి లభ్యత గణనీయంగా పెరిగి రైతులకు స్థిరమైన నీటి భరోసా కల్పించవచ్చని తెలిపింది. ప్రస్తుతం వర్షాలపై ఆధారపడుతున్న లక్షలాది ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా కొత్త జీవం లభిస్తుందని అభిప్రాయ పడింది.రాయలసీమతో పాటు కోస్తాంధ్ర ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని ఇంజనీర్ల సంఘం పేర్కొంది. సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాల కోసం దీర్ఘకాలిక పరిష్కారాన్ని అందించే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉందని వివరించింది. నీటి లభ్యత పెరగడం ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తరించి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొంది. గోదావరి జలాల పంపకాల అంశంపై ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య చర్చలు కొనసాగుతున్న తరుణంలో విశ్రాంత ఇంజనీర్ల సంఘం చేసిన ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. సాంకేతిక పరిజ్ఞానం, జలవనరుల నిర్వహణలో అనుభవం ఉన్న నిపుణులు ప్రాజెక్టుకు బహిరంగ మద్దతు తెలపడం గమనార్హంగా మారింది. గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకుని కరవు ప్రాంతాలకు శాశ్వత నీటి భద్రత కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు కీలక ఆయుధంగా నిలుస్తుందని సంఘం తన లేఖలో స్పష్టం చేసింది.

# ఏపీలో వర్షాల హెచ్చరిక

**-అల్పపీడన ప్రభావం కొనసాగింపు**

**-పలు జిల్లాలకు వర్షాలు**

**-ప్రజలకు అప్రమత్త సూచనలు**



అమరావతి, జూన్ 14 (మనప్రజాప్రతినిధి): దక్షిణ కోస్తాంధ్ర నుంచి తమిళనాడు వరకు విస్తరించిన అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో సోమవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు సంస్థ నిర్వహణ సంచాలకుడు ప్రఖర్ జైన్ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులు, సాధారణ ప్రజలు తాజా వాతావరణ హెచ్చరికలను గమనించాలని సూచించారు. మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా కొండ ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మేఘావృత వాతావరణం కొనసాగుతుండటంతో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు వెల్లడించారు.కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో కూడా వర్ష ప్రభావం కనిపించనున్నట్లు అంచనా వేశారు. ఈ ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట పొలాల్లో పనిచేసే సమయంలో పిడుగుల ప్రమాదంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ వర్షం కురిసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే స్థానిక అధికారుల సూచనలను పాటించాలని కోరారు.అదేవిధంగా శ్రీకాకుళం, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, గుంటూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వివరించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ వర్షాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను తగ్గించి వాతావరణాన్ని చల్లబరచే అవకాశాలు ఉన్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు. వర్షాలు, పిడుగులతో కూడిన ఉరుముల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో, భారీ ప్రకటన బోర్డుల వద్ద నిలబడకూడదని సూచించింది. అవసరమైతే సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులను సంప్రదించాలని పేర్కొంది. వాతావరణ పరిస్థితులపై నిరంతర నిఘా కొనసాగుతోందని, అవసరమైన హెచ్చరికలు ఎప్పటికప్పుడు జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు.



# సింగపూర్‌లో చంద్రబాబుకు ఘన స్వాగతం

**-తెలుగు ప్రజల ఆత్మీయత**

**-కుటుంబాలతో తరలివచ్చిన అభిమానులు**

**-ముఖ్యమంత్రితో సందడి క్షణాలు**



సింగపూర్, జూన్ 14 (మనప్రజాప్రతినిధి): రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సింగపూర్ చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం పరిసర ప్రాంతాలు తెలుగు ప్రజల సందడితో కళకళలాడాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రవాస కుటుంబాలు ముఖ్యమంత్రికి స్వాగతం చెబుతూ తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. దీంతో సింగపూర్‌లో తెలుగు వాతావరణం నెలకొన్నట్లు కనిపించింది. ముఖ్యమంత్రి రాక కోసం ముందుగానే వేచి ఉన్న తెలుగు సంఘాల ప్రతినిధులు, ప్రవాస భారతీయులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానం పలికారు. పలువురు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం చెప్పగా, మరికొందరు జాతీయ జెండాలు, పార్టీ జెండాలతో సందడి చేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా అక్కడి తెలుగు ప్రజల్లో విశేష ఉత్సాహం కనిపించింది. పలువురు చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని కొనియాడుతూ నినాదాలు చేశారు.ప్రత్యేకంగా తెలుగు కుటుంబాలు తమ చిన్నారులతో కలిసి పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరయ్యాయి. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ మాతృభూమిపై ప్రేమను చాటుకుంటూ ముఖ్యమంత్రిని కలుసుకునేందుకు ఆసక్తి చూపాయి. చిన్నారులు, యువత, వృద్ధులు ఇలా అన్ని వయసుల వారు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా చూసేందుకు పలువురు గంటల తరబడి వేచి ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ప్రజలతో మమేకమవుతూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు కుటుంబ సభ్యులతో కలిసి చిత్రాలు దిగేందుకు ముందుకు రాగా ముఖ్యమంత్రి చిరునవ్వుతో వారిని ఆహ్వానించారు. ఈ దృశ్యాలు అక్కడి తెలుగు ప్రజల్లో మరింత ఆనందాన్ని నింపాయి.సింగపూర్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, పరిశ్రమల విస్తరణ, సాంకేతిక రంగ అభివృద్ధి వంటి అంశాలపై కూడా చర్చించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి తమవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పలువురు ప్రవాసులు పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలు కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక సహకారం వంటి అంశాలపై ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.



# ఎస్సి సబ్-క్లాసిఫికేషన్ రోస్టర్ విధానంపై మాల సంఘాల ఆందోళన




మన ప్రజప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 14,:తెలంగాణలో 2025 ఏప్రిల్ 14 నుంచి అమలులోకి వచ్చిన ఎస్సి సబ్–క్లాసిఫికేషన్ రోస్టర్ విధానం మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని డాక్టర్ ఎం.ఎఫ్. గోపినాథ్ ఆరోపించారు. ఆదివారం మెదక్ పట్టణ కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్లో ఎం సి ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటా ్లడుతూ.... 100 పాయింట్ల రోస్టర్‌లో ఎస్సి గ్రూప్–III (మాల)కు మొదటి అవకాశం 22వ పాయింట్ వద్ద మాత్రమే ఉండటంతో, 22 పోస్టుల కంటే తక్కువ ఉన్న నియామకాలలో మాల అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. చిన్న శాఖలు, చిన్న నోటిఫికేషన్లలో మాలలకు అవకాశాలు పూర్తిగా కోల్పోతున్నాయని పేర్కొన్నారు.ఇప్పటికే టీఎస్ఆర్టీసి డ్రైవర్లు, శ్రామిక్, సూపర్వైజర్, గ్రూప్–4 వంటి నాలుగు నియామకాల్లోనే మాల కమ్యూనిటీకి 264కిపైగా పోస్టులు నష్టపోయినట్లు వెల్లడించారు.ఈ నేపథ్యంలో ప్రతి నియామకంలో సైక్లిక్ రోస్టర్ అమలు చేయాలని, అన్ని శాఖల్లో 100 పాయింట్ల రోస్టర్‌ను తప్పనిసరి చేయాలని, జిల్లా వారీ కాకుండా రాష్ట్ర స్థాయి సింగిల్ రోస్టర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 22వ పాయింట్ సమస్యను పరిష్కరించి, కోల్పోయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మల కోఆర్డినేషన్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గోపీనాథ్ , మాజీ మంత్రి దేవయ్య , శకుంతల , వెంకయ్య , డా. తిరుపతయ్య , జెల్ల సుధాకర్ , ప్రొఫెసర్ వెంకటదాస్ , హైకోర్టు న్యాయవాది పద్మారావు ,వివిధ సంఘాల నాయకులు శంకర్ ,కల్లూరి సంజీవ్ , దుబాసి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



మన ప్రజప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 14:దుబ్బాక నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దుబ్బాక నియోజకవర్గ పరిధిలో ఉన్న 5 వ్యవసాయ మార్కెట్ కమిటీల లో ప్రతి మార్కెట్‌కు 40,000 మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం కల్పిస్తూ మొత్తం 2 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం కలిగిన ఆధునిక గోదాములు మంజూరు చేయాలని కోరారు. అలాగే రైతులకు యూరియా, దుక్కి మందు, పురుగుమందులు, వివిధ రకాల నాణ్యమైన విత్తనాలు సకాలంలో, అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పంటల నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడితే రైతులకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ, ఈ అంశాలపై మంత్రి కి వినతిపత్రం అందజేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా దుబ్బాక రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

# జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తాం సీఎం రేవంత్ రెడ్డి



మన ప్రజప్రతినిధి తెలుగు దిన పత్రిక:జర్నలిస్టులకు సొసైటీల పేరుతో కాకుండా ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.న్యూఢిల్లీలో శనివారం జర్నలిస్టులతో జరిగిన భేటీలో సీఎం మాట్లాడుతూ,"జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే సంకల్పంతోనే కేబినెట్ సబ్ కమిటీ వేశాం.మీకు ఎలాంటి సమస్య ఉన్నా మంత్రులు భట్టి విక్రమార్క,ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు,దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకురండి.సబ్ కమిటీ ఒకే చోట కూర్చొని సిఫార్సులు తీసుకువస్తే,మీరు టీ తాగే లోపే మినిట్స్ రాసి కేబినెట్‌లో ఆమోదిస్తాం" అని చెప్పారు.వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇచ్చే విధానం వల్ల భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు రాకుండా ఉంటాయని సీఎం వివరించారు."సొసైటీలపై పిటిషన్ వేయడం సాధ్యమే,కానీ ఒక్కొక్కరి పేరు మీద ఇస్తే ఎవరూ పిటిషన్ వేయలేరు.ఒక్కొక్కరి పేరు మీదే వేయాల్సి వస్తుంది.అది ఆచరణ సాధ్యం కాదు.భవిష్యత్తులో ఈ ఇళ్ల స్థలాలపై ఎలాంటి వివాదాలు రాకూడదన్నదే మా ఉద్దేశం"అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# సంసారం విషయం లో భర్త తో గొడవ పడి పురుగుల మందు తాగి మహిళా మృతి

మన ప్రజ ప్రతినిధి తెలుగు దీన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 14:మసాయిపేట్ మండల పరిదిలోని పులిగుట్ట తాండ కు చెందిన మాలోతు సోనీ ( 50) తన భర్తతో సంసార విషయములో గొడవపడి మనస్థాపము చెంది ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి మరణించినదని ఇట్టి విషయములో మృతురాలి భర్త మాలోత్ కాశీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.





# కృష్ణానదిలో పడవ విషాదం

**-పల్నాడులో ఘోర ప్రమాదం**
**-నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటన**
**-ముగ్గురు చిన్నారుల మృతి**



పల్నాడు, జూన్ 14 (మనప్రజాప్రతినిధి): పల్నాడు జిల్లాలో ఆదివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. అచ్చంపేట మండలం కోనూరు గ్రామం సమీపంలోని కృష్ణానదిలో చిన్న పడవ బోల్తా పడటంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉండటం మరింత విషాదాన్ని నింపింది. సరదాగా నదిలో విహారానికి వెళ్లిన కుటుంబ సభ్యులు, బంధువుల ఆనందం క్షణాల్లోనే విషాదంగా మారిపోయింది. ఈ ఘటనతో కోనూరు గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం కోనూరు గ్రామానికి చెందిన కుంకలగుంట గంగయ్య ఇంటికి బంధువులు ఓ కుటుంబ వేడుక నిమిత్తం వచ్చారు. కార్యక్రమం అనంతరం అందరూ కలిసి సరదాగా గడపాలని నిర్ణయించుకున్నారు. దీంతో పది మంది ఒక చిన్న పడవలో కృష్ణానదిలో విహారయాత్రకు బయలుదేరారు. మొదట ప్రయాణం సజావుగానే సాగినప్పటికీ తిరుగు ప్రయాణంలో అనుకోని ప్రమాదం చోటుచేసుకుంది.నది మధ్య ప్రాంతానికి చేరుకున్న సమయంలో పడవ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్న వారంతా నీటిలో పడిపోయారు. ప్రమాదం ఊహించని విధంగా జరగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కొందరు ఈదుకుంటూ బయటపడేందుకు ప్రయత్నించగా, మరికొందరు ప్రవాహంలో చిక్కుకుపోయారు. క్షణాల్లో జరిగిన ఈ ఘటన అక్కడ ఉన్నవారిని షాక్‌కు గురిచేసింది. పడవ బోల్తా పడిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. ప్రాణాలకు తెగించి నదిలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించారు. గ్రామస్థుల సమయస్ఫూర్తి కారణంగా ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకురాగలిగారు. అయితే మిగిలిన నలుగురు కనిపించకపోవడంతో ఆందోళన నెలకొంది. వెంటనే పోలీసులకు, విపత్తు సహాయక బృందాలకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. నదిలో విస్తృతంగా వెతికిన అనంతరం గల్లంతైన నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. గ్రామస్థులు కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. పడవలో సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటం, సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఒక కుటుంబ వేడుక కోసం కలుసుకున్న బంధువుల మధ్య చోటుచేసుకున్న ఈ విషాదం పల్నాడు జిల్లాను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

